క్లుప్తంగా

ఎస్పీని కలిసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్



ఎస్పీకి బొకే అందిస్తున్న షంషేర్ ఆలీబేగ్

మార్కాపురం: ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏ–1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ శనివారం ఒంగోలులో ఎస్పీ దామోదర్‌ను కలిసి బొకే అందించారు. స్థానిక పరిస్థితులు ఆయనకు వివరించారు.

చదరంగం పోటీలతో మేధోశక్తి పెంపు



గ్రంథాలయంలో చదరంగం పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గిద్దలూరు రూరల్: చదరంగ పోటీల ద్వారా విద్యార్థుల మేధోశక్తి పెంపొందుతుందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్యయాదవ్ అన్నారు. 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు నల్లబోతుల ప్రసన్నకుమారి, విశ్రాంత ఉపాధ్యాయులు రామిరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు మస్తాన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదాయ మార్గాలపై దృష్టిపెట్టి పంచాయతీలకు అధికంగా నిధులు సమకూర్చుకోవాలని, 15వ ఆర్థిక సంఘ నిధులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు డీ ఖాజామీయా పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తి అరెస్టు



మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

గిద్దలూరు రూరల్: అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తిని స్థానిక ఎక్సైజ్ సీఐ ఎం.జయరావు శనివారం అరెస్టు చేసి అతడి వద్ద ఉన్న 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు రాచర్ల మండలం యడవల్లి గ్రామంలో అక్రమంగా ఓ వ్యక్తి మద్యం విక్రయిస్తున్నారని తెలియడంతో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో చిట్టెం బాబు అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండటంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది శ్రీపతి, బత్తిని వెంకటేశ్వర్లు, హరిబాబు, షరీఫ్, రహమ్మతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి

పొదిలి రూరల్: పొగాకు సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలైన బొబ్బర, శనగ, మినుము, జొన్న పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైన్ లాబ్దిన్ అన్నారు. మండలంలోని ఆముదాలపల్లి, కాటూరివారిపాలెం గ్రామాల్లో పొగాకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్యామ్నాయ పంటలు, పొగాకు ఉత్పత్తి నియంత్రణ వాటి ఆవశ్యకతపై రైతులకు తెలియజేశారు. పొగాకు సాగు బదులుగా అపరాలైన శనగ, మినుము, పెసర, స్వల్పకాలిక కంది, సోయాబీన్, ఉలవలు, అలసందలు, చిరుదాన్యాలైన జొన్న, సజ్జ, రాగి, కొర్ర, ఆరిక, సామ, వరిగలు మొదలగు పంటలు రబీలో సాగుకు అనుకూలంగా ఉంటాయన్నారు. హైబ్రిడ్ రకాలు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయని, అధిక దిగుబడినిచ్చే రకాలు ఎంపిక చేసుకుని ఆహార ధాన్యాల కొరత లేకుండా పెరుగుతున్న జనాభాకు సరిపడా నిల్వలు, ఉత్పత్తులు సాధించాలని కోరారు. పొగాకు సాగుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకొని తక్కువ కాల వ్యవధిలో తక్కువ ఖర్చుతో తక్కువ శ్రమతో సాగు చేసే పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని రైతులను కోరారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కంది దిగుబడులపై రైతుల ఆశలు

- పశ్చిమ ప్రకాశంలో 13,761 హెక్టార్లలో సాగు
- మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటా రూ.9 నుంచి రూ.10 వేలు
- వైరస్, మారుకా మచ్చ తెగుళ్లతో రైతుల అప్రమత్తం



రైతులు సాగు చేసిన కంది పంట

మార్కాపురం:

పశ్చిమ ప్రకాశంలో రైతులు కంది దిగుబడులపై ఆశలు పెంచుకున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా రూ.9 వేల నుంచి 10 వేల మధ్య ఉండటంతో మంచి దిగుబడులు వస్తే లాభసాటిగా ఉంటుందని ఆశిస్తున్నారు. పశ్చిమ ప్రకాశంలోని 13 మండలాల్లో మొత్తం 13,761 హెక్టార్లలో కంది సాగు చేశారు. ఎకరాకు సుమారు 15 వేల రూపాయల వరకు విత్తనాలు, పెట్టుబడులు, కూలీలకు ఖర్చు చేశారు. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకూ దిగుబడుల రావచ్చని భావిస్తున్నారు. ఎక్కువగా పుల్లలచెరువు, పెద్దారవీడు, బేస్తవారిపేట, యర్రగొండపాలెం, మార్కాపురం, తర్లుపాడు, కొమరోలు తదితర మండలాల్లో అధిక విస్తీర్ణంలో కందిసాగు చేపట్టారు. హైబ్రిడ్ విత్తనాలతో పాటు ఎల్ఆర్‌జి 52 రకాన్ని రైతులు సాగు చేశారు. జనవరి నెలాఖరుకు దిగుబడులు రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడా వైరస్ తెగులు, మారుక మచ్చ తెగులు కనిపించడంతో దిగుబడులపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేస్తుండగా సస్యరక్షణ చర్యలు చేపడితే ఇబ్బంది ఉండదని వ్యవసాయాధికారులు తెలిపారు. మార్కాపురం మండలం వేములకోట, చింతగుంట్ల, తిప్పాయపాలెం, నికరంపల్లి, గజ్జలకొండ, రాయవరం, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, మీర్జాపేట, తాడివారిపల్లి, పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు, బద్వీడు చెర్లోపల్లి, తంగిరాలపల్లి, సిద్ధినాయునిపల్లి, చట్లమిట్ల, సానికవరం, యర్రగొండపాలెం మండలంలోని అమానిగుడిపాడు, గురిజేపల్లి, పుల్లలచెరువు మండలంలోని వెంకటరెడ్డిపల్లి, నాయుడుపల్లి, చాపలమడుగు తదితర గ్రామాల్లో కంది పంటలు సాగు చేశారు.

డివిజన్‌లో కంది సాగు ఇలా..

మండలం	సాగు (హెక్టార్లలో)
మార్కాపురం	1426
తర్లుపాడు	1038
గిద్దలూరు	1359
బేస్తవారిపేట	1432
కంభం	166
అర్ధవీడు	268
కొమరోలు	637
రాచర్ల	816
యర్రగొండపాలెం	1786
పుల్లలచెరువు	2636
త్రిపురాంతకం	850
పెద్దారవీడు	1078
పెద్దదోర్నాల	269
మొత్తం	13,761 (హెక్టార్లు)



కంది సాగుపైనే ఆశలు: ఈ ఏడాది కంది సాగుపైనే మా ఆశలు. దాదాపు ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల వరకూ దిగుబడులు రావచ్చని అనుకుంటున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో కందికి మంచి ధర ఉంది. కందిపప్పు కూడా ఎక్కువ ధర పలుకుతోంది. ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగుళ్లు వస్తాయనే భయం ఉంది. తెగుళ్లు రాకపోతే దిగుబడులు పెరుగుతాయి.

– వెంకటయ్య, రైతు, చెన్నరాయునిపల్లి, మార్కాపురం



తెగుళ్లతో అప్రమత్తంగా ఉండండి: ఇటీవల కురిసిన వర్షాలకు మారుకా మచ్చల పురుగు, వైరస్ తెగులు ఆశించే ప్రమాదం ఉంది. రైతులు అప్రమత్తంగా ఉండాలి. మారుకా మచ్చల పురుగు సోకితే నివారణకు వేపనూనె 300 మిలీ, క్లోరిఫైరిఫాస్ 300 మిలీ కలిపి వారం రోజులకోసారి పిచికారీ చేయాలి. వైరస్ తెగులు (వెర్రి తెగులు) ఆశిస్తే ఈ పురుగు ఆకులను విపరీతంగా తింటుంది. దీని నివారణకు ఇమామేక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములు, లేదా ఫ్లూబెండామైడ్ 50 మిలీ పిచికారీ చేసుకుంటే నివారించుకోవచ్చు. ఈ రెండు తెగుళ్లు పూత, పిందె, కాయ దశల్లో సోకి పంటకు హాని కలిగిస్తాయి.

– దేవిరెడ్డి శ్రీనివాసులు, ఏఓ, మార్కాపురం

చెన్నకేశవ, వెంకటేశ్వర స్వామి వార్లకు శాంతి పూజలు



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ దేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో చెన్నకేశవస్వామి వారికి ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చన, ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, రంగమాచార్యులు, అర్చక బృందం నిర్వహించింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారికి, శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు అర్చకులు అరుణ్‌స్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు చెన్నకేశవ స్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది, వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రంగస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి



లక్ష్మమ్మ వనం వద్ద బారులు తీరిన భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు రంగనాయకుని దర్శనం చేసుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వచ్చింది. ఆలయం సమీపంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. కృష్ణదేవరాయుల కాపుబలిజ, కాశినాయన, యోగి వేమన రెడ్ల, ఆర్యవైశ్య, గోపాలకృష్ణ యాదవ అన్నదాన సత్రాల్లో కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. తొలుత నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారికి దేవస్థానం అర్చకులు అన్నవరం పాండురంగాచార్యులు, సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్ పాల్గొన్నారు.

బాలలు చైతన్యవంతులు కావాలి



మార్కాపురం టౌన్: విద్యార్థులతో సబ్ కలెక్టర్ త్రివినాగ్



పొదిలి రూరల్: ఉప్పలపాడులో మాట్లాడుతున్న విద్యాసాగర్

- సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: బాల్యం, బాలల హక్కులు, బాల్యం విలువలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించాలని సబ్ కలెక్టర్ వెంకట నాగ త్రివినాగ్ సూచించారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం కార్యక్రమం హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలను చైతన్యం చేయటం గురించి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. బాలల హక్కుల పరిరక్షణనకు చేస్తున్న కృషిని మనతో పంచుకునేందుకు పిల్లల్లో ఆ బీజాలు నాటడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. ఉప విద్యాశాఖాధికారి బి.శామ్యూల్ జాన్ మాట్లాడుతూ విద్యావంతమైన, ఆరోగ్యకరమైన బాల్య వివాహ రహితమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. బాల కార్మిక రహితమైన ప్రకాశం జిల్లా ఆవిష్కృతమయ్యేలా బంగారు బాల్యం మనందరి లక్ష్యమన్నారు. విద్యార్థులకు బాలల భద్రత, లింగ వివక్ష లేని ప్రకాశం అనే అంశంపై వ్యాసరచన, బాలల స్నేహ పూరిత గ్రామాలు అనే అంశంపై చిత్రలేఖనం, బాల కార్మికులు అక్రమ రవాణా లేని ప్రకాశం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఎంఈవోలు రాందాస్ నాయక్, టి.శ్రీనివాస్, సీనియర్ ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్యామ్ శుభకర్, వీరారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జీఎల్ రమేష్, కె.వేణుగోపాల్, సక్కు నాయక్, కొండయ్య, విజయభారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లలిత సలోమి

పొదిలి రూరల్: విద్యార్థులందరూ తమ సామర్థ్యాలు, బలాల ఆధారంగా నిర్దిష్ట లక్ష్యాలు ఏర్పరచుకోవాలని మండల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ అన్నారు. శనివారం పొదిలి మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కులు–బాధ్యతల గురించి తెలియజేశారు. విద్యార్థులు ఎన్ని ఆటంకాలు ఎదురైనా అధిగమించాలన్నారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాలలో చిన్నారులు బాల్యం నుంచే చక్కటి అలవాట్లను అలవర్చుకుని మంచి లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఎంపీడీఓ జి.శోభన్‌బాబు, ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సర్పంచ్ గుంటూరి ఏసోబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: రాయవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని ఐసీడీఎస్ మార్కాపురం రూరల్ సూపర్‌వైజరు పి.లలిత సలోమీ శనివారం నిర్వహించారు. బాల్య వివాహాలపై విద్యార్థులకు తగు సూచనలు చేశారు. బంగారు బాల్యం కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రామకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీకాంత్, హెచ్‌వీ విమల, సీహెచ్‌ఓ రాణెమ్మ, ఏఎన్‌ఎం విశ్రాంతమ్మ, డబ్ల్యూపీ ఆంజనేయులు, రమాదేవి, పద్మ, మహిళా పోలీసు నాగలక్ష్మి పాల్గొన్నారు.

కొనకనమిట్ల: ప్రతి ఒక్కరూ బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి పేర్కొన్నారు. బంగారు బాల్యం వారోత్సవాల్లో భాగంగా శనివారం బాలలు వారి హక్కులు, బాధ్యత నిర్వహణ వారి భవిష్యత్ నిర్ణయించుటలో వారి భాగస్వామ్య చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు లేని ప్రకాశం, బాలల భద్రత ప్రకాశం, లింగ వివక్షలేని ప్రకాశం, బాలల స్నేహపూరిత గ్రామాల అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కొమరోలు: బాలికలకు బాల్యవివాహాలు చేయడాన్ని అరికట్టాలని మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. మండలంలోని రాజుపాలెం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని శనివారం ఎంఈవో వెంకటరత్నం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరుగురు 12వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించారు. అనంతరం బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. విద్యార్థినులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రోజ్‌సులోచన, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

సమయపాలనతో ఆర్టీసీ సర్వీసులు



గిద్దలూరు: మాట్లాడుతున్న డీఎం చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎం నరసింహులు

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ బస్సులు ఇక పై తప్పకుండా సమయపాలన పాటిస్తాయని డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ అన్నారు. సమయపాలన మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఉద్యోగులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్ణయించిన సమయానికి తప్పకుండా బస్సుల రాకపోకలు జరుగుతాయన్నారు. బస్సులు కేటాయించిన సమయానికి నడవటం వల్ల ప్రయాణికుల్లో ఆర్టీసీ అంటే నమ్మకం ఏర్పడుతుందన్నారు. రిజర్వేషన్ చేసుకున్న వారి కోసం కేవలం 5 నిమిషాలు మాత్రమే డిపోలో ఎదురు చూస్తుందని దాని తరువాత తప్పకుండా బస్సు కదులుతుందని ప్రయాణికులు గమనించాలని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా అరుణాచలం, పంచారామాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 4 గంటలకు, 5 గంటలకు శ్రీశైలానికి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంటీ షేక్.మౌనిక, గ్యారేజి ఇన్‌చార్జ్ పి.గురవయ్య, నాయక్, శేఖర్, కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లు సమయపాలన పాటించాలి

మార్కాపురం: ప్రతి డ్రైవరూ సమయపాలన పాటించి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలని డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు చెప్పారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఈ నెల 16 నుంచి వచ్చే నెల 15 వరకూ జరిగే సమయపాలన మాసోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, సూపర్‌వైజర్లు అందరూ సమయపాలన పాటించి ప్రయాణికుల మన్ననలు పొందాలన్నారు. వర్షాకాలంలో బస్సులను జాగ్రత్తగా నడపాలని, ఎలాంటి యాక్సిడెంట్లు జరగకుండా చూడాలని కోరారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ఈపీకే, కేఎంపీఎల్ తేవాలని సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బ్యాంకు ఖాతాలు లేని వారికి పోస్టల్ అకౌంట్

మార్కాపురం టౌన్:

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలు లేని వారికి పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసి ఎన్‌పీసీఐ యాక్టివేట్ చేయనున్నట్లు కమిషనర్ నారాయణరావు శనివారం తెలిపారు. పట్టణంలోని అరవింద ఫెష్ స్ట్రీట్, జామియా మజీద్ సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సచివాలయాల పరిధిలోని ప్రజలకు పోస్టల్ శాఖ సిబ్బంది సహకారంతో అకౌంట్‌లను ఓపెన్ చేస్తామని చెప్పారు. ఎన్‌పీసీఐ యాక్టివేట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాల ద్వారా వచ్చే నగదు తమ బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. సచివాలయాలకు వచ్చే వారు తమ ఆధార్ కార్డు, పాన్ కార్డులతో హాజరు కావాలని కోరారు. తమ బ్యాంకు ఖాతాలకు ఆధార్ నంబరు లింకు కాని వారు సచివాలయంలో అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు.

జీజీహెచ్‌లో రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు అందిస్తున్న డాక్టర్లు రాంబాబు, సాయికిరణ్, రమణ

మార్కాపురం రూరల్: జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మార్కాపురం జీజీహెచ్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జర్నలిస్టులపై అక్రమ కేసులు, మీడియాపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చ అన్నారు. పత్రికా స్వేచ్ఛ బలంగా ఉంటేనే ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని కోరారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు, అక్రిడేషన్లు ఇవ్వాలని కోరారు. మజీద్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాంబాబు, డాక్టర్ సి.సాయికిరణ్‌తో పాటు యూనియన్ నాయకులు డి.మోహన్‌రెడ్డి, మూల అల్లూరెడ్డి, ఎస్‌కే అన్వూ, బి.సురేష్, వి.రాజు, సుబ్బారావు, కరీం, ఆదినారాయణ, డి.శరణ్ కుమార్ పాల్గొన్నారు.

మందుల కోసం పరిశోధన చేయాలి

- ఏకేయూ వీసీ డీవీ మూర్తి



విద్యార్థులతో వీసీ మూర్తి, చైర్మన్ సతీష్

మార్కాపురం: ఫార్మసీ విద్యార్థులు సమాజంలో ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక వ్యాధులకు మందులపై పరిశోధన చేయాలని ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీ మూర్తి సూచించారు. శనివారం పట్టణంలోని జార్జి బీ ఫార్మసీ కళాశాలలో 20వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం కళాశాల చైర్మన్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డీవీ మూర్తి మాట్లాడుతూ మందుల వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జపాన్‌లో ప్రస్తుతం వాడుతున్న ట్రస్టు మెడిసిన్ విధానం వివరించారు. కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత ముంబైకి చెందిన ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ హెచ్‌ఓడీ డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ మందుల తయారీలో క్వాలిటీ ప్రమాణాలు పాటించాలని, అందుకు తగిన నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. కళాశాల పూర్వ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ సతీష్ ఫార్మసీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, సమాజానికి ఉపయోగపడే మందుల తయారీలో ఫార్మసిస్టులదే కీలకపాత్ర అన్నారు. విద్యార్థులకు పట్టాలు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజా జయరావు, ప్రొఫెసర్లు శ్రీకాంత్, సునీత, భాస్కర్, రఘువీర్, రాజ్‌కుమార్, ముజీబ్, కృపాకర్, రాజు, శేషయ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- గిద్దలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఓంకార్



విద్యార్థులతో మాట్లాడుతున్న గిద్దలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఓంకార్

రాచర్ల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని గిద్దలూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. బంగారు బాల్యం వారోత్సవాల సందర్భంగా మండలంలోని రాచర్లఫారం లోని గురుకుల బాలికల పాఠశాల, రాచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకోవాలని, చదువు వలనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు వారణాసి గిరిధర్‌శర్మ, శివకోటేశ్వరరావు, ఏపీఎమ్ రమేష్‌బాబు, ఎస్సై కోటేశ్వరరావు, పారాలీగల్ వలంటీర్లు కత్తి అనోజీరావు, ఏలియా, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సర్పంచి బోడయ్య

కంభం: పారిశుధ్య కార్మికులకు దాతలు చేయూతనందించడం అభినందనీయమని కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి శనివారం గతంలో కంభం ఉపసర్పంచిగా పనిచేసిన కురంగి గాలయ్య కుమారుడు కురంగి నరసింహారావు తన తండ్రి జ్ఞాపకార్థం దుప్పట్లు పంపిణీ చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచి సయ్యద్ ఖాసిం, పంచాయతీ కార్యదర్శి పాలగుళ్ళ రమేష్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమంలో మహనీయులు

మార్కాపురం: గ్రంథాలయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మహనీయులు అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, పాతూరి నాగభూషణం, కాశీనాథ్ నాగేశ్వరరావులు మహనీయులని గ్రంథపాలకులు జీవీ శివారెడ్డి, ప్రముఖకవి, దిట్టకవి శ్రీనివాసాచార్యులు అన్నారు. శనివారం పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పాటల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఎంవీ సుబ్బారావు, సుభాషిణి, పుష్పలత, సంధ్యలు వ్యవహరించారు.